సాక్షి
నంద్యాల
శనివారం । 29 । జూన్ । 2024



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై శుక్రవారం విజయవాడకు చెందిన అభినయ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి నరసరావు పేటకు చెందిన ఎంఎస్. రామలింగారెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణకులు నాగరాజుకు అందజేశారు.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం అందించే పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు శుక్రవారం తెలిపారు. 2025వ సంవత్సరానికి అర్హత ఉన్న క్రీడాకారులు దరఖాస్తులను www. padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. ఈ వెబ్‌సైట్‌లో క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని ఆ పత్రాలను వర్డ్, పీడీఎఫ్ ఫార్మెట్‌లో incentives. schemes @gmail.com, sportsinap@gmail.comకు పంపాలన్నారు. అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సిఫార్సు చేస్తుందన్నారు.

స్టడీ సెంటర్ల అనుమతులకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్ల నిర్వహణకు వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తారన్నారు. ఇతర వివరాలకు డీఈఓ కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

పీఎంశ్రీ స్కూళ్లలో ఒకేషనల్ విద్య

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలో ఒకేషనల్ విద్యను అమలు చేస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారిణి లలితమ్మ శుక్రవారం తెలిపారు. 2024 - 25 విద్యాసంవత్సరంలో అమలు చేసే ఒకేషనల్ విద్య పాఠశాలలను పర్యవేక్షించే బాధ్యతను సమగ్ర శిక్ష జీసీడీఓకు అప్ప గించినట్లు ఆమె తెలిపారు. అంత్యంత ప్రాధాన్యతగా సమగ్ర శిక్షణ ఏపీసీలు ఈ ప్రక్రియను అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చాయన్నారు.

ఉచిత ప్రవేశాలకు మూడో విడత ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలులో భాగంగా 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల మూడో విడత ఎంపిక జాబితా ప్రభుత్వం విడుదల చేసిందని నంద్యాల జిల్లా సమగ్ర సర్వశిక్ష అభియాన్ అధికారి లలితమ్మ శుక్రవారం తెలిపారు. ఆ జాబితా ప్రకారం ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు కేటాయించిన పాఠశాలలో ఈనెల 29వ తేదీన సంబంధిత ఎంఈఓలకు సర్టిఫికెట్లు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. అందిన ఫిర్యాదులను సంబంధిత ఎంఈఓలు ఈనెల 30వ తేదీన డీఈఓకు, జూలై 1వ తేదీన రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ ఎస్‌పీడీకి అందజేయాల్సి ఉంటుందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

- డీఈఓ సుధాకర్‌రెడ్డి



మోడల్ స్కూల్ విద్యార్థుల తండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని డీఈఓ కె.సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. మండలం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి విధులకు హాజరుకాకపోవడంతో డీఈఓ మండిపడ్డారు. మండలం ప్రాథమిక పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు టీసీ తీసుకొని ప్రైవేటు పాఠశాలకు వెళ్లటాన్ని చూస్తే పాఠశాల హెచ్‌ఎం హరి భోగేశ్వరరావు బడికివెళ్దాం కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడవుతుందన్నారు. ఎంఈఓ-2 శ్రీనివాసులు అనుమతి తీసుకోకుండా సెలవుచీటి పెట్టి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ముగ్గురిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 69 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన చేస్తుండగా వారు ఈ ఏడాది ఆ సిలబస్‌లోనే వార్షిక పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీబీఎస్ఈ సిలబస్ విద్యాబోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జూపాడుబంగ్లా మోడల్, కస్తూర్బా పాఠశాలల్లోని హాస్టళ్లలో మెనూ ప్రకారంగా భోజనం వడ్డించాలని ప్రిన్సిపాల్ రమేష్‌కు సూచించారు. అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో అందుతున్న విద్య, వసతుల గురించి వివరించారు.



- విమానయానంపై పెరిగిన ఆసక్తి
- ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయం నుంచి వైజాగ్, చెన్నై నగరాలకు విమానాలు
- ఏటా పెరుగుతున్న విమాన ప్రయాణికులు
- మూడేళ్ల కాలంలో 1,20,732 మంది ప్రయాణం
- మరిన్ని సర్వీసులు పెంచాలని ప్రయాణికుల విజ్ఞప్తి



గ'ఘన' విహారం

కర్నూలు(సెంట్రల్): విమాన ప్రయాణంపై ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఓర్వకల్లు సమీపంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయం నుంచి వైజాగ్, చెన్నై నగరాలకు తక్కువ సమయంలో చేరుకోగలుగుతున్నారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారికి విమానాశ్రయం అనువుగా ఉంటోంది. సమయం, డబ్బును ఆదా అవుతోంది. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి మూడేళ్లలో 1,20,732 మంది ప్రయాణం చేశారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి 57,327 మంది కర్నూలుకు రాగా, కర్నూలు నుంచి 63,405 మంది విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై మహా నగరాలకు వెళ్లారు.

ఎయిర్‌పోర్టు ప్రస్థానమిదీ..

ప్రతి జిల్లాకు ఒక విమానాశ్రయం ఉండాలని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంకల్పించారు. ఈ కోవలోనే కర్నూలు విమానాశ్రయానికి బీజం పడింది. ఇందుకోసం ఓర్వకల్లు సమీపంలో 1,010 ఎకరాలు కేటాయించారు. కేంద్ర విమానయాన శాఖ అనుమతులు రావడంతో 2017లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో వసతులు సమకూరిన అనంతరం 2021 మార్చి 28న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టారు. అప్పటి నుంచి విమానాల రాకపోకలు జోరందుకున్నాయి.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల సందడి

ఇవీ సౌకర్యాలు

- కర్నూలు–నంద్యాల జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు చేరుకోవడానికి వీలుగా అప్రోచ్ రోడ్డు నిర్మించారు.
- ప్రయాణికులు, వివిధ వాహనాల రాకపోకలకు వీలుగా నాలుగు ఇంటర్నల్ రోడ్లు ఉన్నాయి.
- 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్ (పీటీబీ) ఉంది.
- టెర్మినల్‌కు ఎదురుగా నాలుగు విమానాలు ఒకేసారి పార్కింగ్ చేసేందుకు ఆప్రాన్ నిర్మించారు.
- టర్మినల్ బిల్డింగ్ బయట వైపు కనువిందు చేసేలా ఉద్యానవనం అభివృద్ధి చేశారు.

విశాఖకు అధికం

కర్నూలు నుంచి విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై మహానగరాలకు వారంలో నాలుగు రోజులు విమానాలు వచ్చి వెళ్తున్నాయి. వివిధ కారణాలతో నెలరోజుల నుంచి బెంగళూరు నుంచి వచ్చే విమానాలు రద్దయ్యాయి. మూడేళ్ల కాలంలో 1,20,732 మంది ప్రయాణించగా.. ఇందులో 60 వేల మంది విశాఖ నుంచి వచ్చి వెళ్లిన వారే ఉన్నారు. బెంగళూరుకు 38 వేల మంది, చెన్నైకు 22 వేల మంది ప్రయాణం చేసినట్లు తెలుస్తోంది.

విమానయాన శాఖమంత్రి దృష్టి సారించాలి..

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి విజయవాడ, తిరుపతి నగరాలకు విమానాలు తిప్పాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రయత్నించింది. ఈ మేరకు ఇండిగోతో ఒప్పందం కూడా చేసుకుంది. అయినా ఆ సంస్థ విమానాలను నడిపేందుకు ముందుకు రాలేదు. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన రామ్మోహన్‌నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిగా ఉన్నారు. కర్నూలు నుంచి తిరుపతి, విజయవాడలకు విమానాలు నడిపేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా బెంగళూరుకు విమాన సర్వీసులను పునరుద్ధరించాల్సి ఉంది. గతంలో ఫ్లైబిగ్ అనే విమాన సంస్థ కర్నూలు నుంచి హైదరాబాద్‌కు విమానం నడిపేందుకు ఒప్పందం చేసుకున్నా ఫలితం లేకపోయింది. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు విమానాలు తిరిగితే అరగంటలో వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం విమానాల రాకపోకలు..

- ప్రతి మంగళ, గురు, శనివారాల్లో చెన్నై నుంచి కర్నూలుకు ఉదయం 11.25 గంటలకు విమానం వస్తుంది. అదే విమానం 11.45 గంటలకు వైజాగ్‌కు వెళ్తుంది. ఇదే రోజుల్లో వైజాగ్ నుంచి మధ్యాహ్నం 3.25 గంటలకు విమానం కర్నూలుకు వస్తుంది. ఇక్కడి నుంచి 3.45కు చెన్నైకు వెళ్తుంది.

విమానాల్లో ప్రయాణించిన వారి వివరాలు..

ఆర్థిక సంవత్సరం	ప్రయాణికుల సంఖ్య
2021-2022	31,971
2022-23	37,532
2023-24	39,229
2024-25 (ఇప్పటివరకు)	12,000

చాలా సౌకర్యంగా ఉంది



కర్నూలు ప్రజలకు విమానాశ్రయం అందుబాటులోకి రావడం చాలా సౌకర్యంగా ఉంది. నేను నేవీలో కమాండర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. ప్రస్తుతం కర్నూలులో నివాసం ఉంటున్నాను. విమానంలో కర్నూలు నుంచి బెంగళూరు వెళ్లాను. వాహనాల్లో వెళితే దాదాపు 8 గంటల సమయం పట్టేది. విమానంలో 1.30 గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి మరిన్ని సర్వీసులు నడపాలి.

–సురేందర్‌రావు

విజయవాడకు విమానాలు నడపాలి



కర్నూలు నుంచి తిరుపతి, విజయవాడలకు విమానాలు నడపాలి. రాజధాని అమరావతికి వెళ్లాలంటే దాదాపు 8 గంటల ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఏమైనా పనికోసం వెళ్లాలంటే పోవడానికి ఒక రోజు, రావడానికి మరో రోజు సమయం పడుతోంది. కార్యాలయాల సమయాలకు అనువుగా విమానాలు నడిస్తే బాగుంటుంది. తిరుపతి కూడా విమానాలు నడిస్తే ఎంతో ప్రయోజనకరం – జి.చంద్రశేఖర్, కర్నూలు

మహానంది ఆలయ అభివృద్ధికి కృషి

- ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రస్తుతం కోటప్పకొండ ఈఓగా పని చేస్తున్న ఈయనకు రాష్ట్ర ప్రభుత్వం మహానంది ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం ఆయన మహానంది చేరుకుని వేదపండితుల, అర్చకుల ఆశీర్వచనాలు, వేద మంత్రాల మధ్య మహానంది ఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. అందరి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనతరం రెండేళ్లుగా ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డిని ప్రస్తుత ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి, ఆలయ ఏఈఓలు ఎరమల మధు, ఓంకారం వెంకటేశ్వర్లు, హరినాథ్, మల్లయ్య, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి, కూరగాయల దాత టి.ప్రసాద్, ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధన శర్మ, మూలస్థానం శివ శంకర శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటలీ దంపతులకు ఇద్దరు చిన్నారుల దత్తత

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్ శిశు గృహకు చెందిన ఇద్దరు చిన్నారులను ఇటలీకి చెందిన దంపతులకు దత్తత ఇస్తున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయి ఆచారి, మానస అనే ఇద్దరు అన్నా చెల్లెళ్లు 2018 నుంచి శిశు గృహలో ఆశ్రయం పొందుతున్నారన్నారు. వీరిని 2019లో కెనాడాకు చెందిన కుమారి ఆశా బాల చంద్రన్ నయ్యర్ దత్తత తీసుకున్నారని పేర్కొన్నారు. దత్తతతో భాగంగా చిన్నారుల పేర్లను సాయి ఆచారిని ఇషాన్ నయ్యర్‌గా, మానసని దియా నయ్యర్‌గా మార్చుకున్నారని తెలిపారు. అయితే నాలుగు నెలల అనంతరం తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా చిన్నారులను సంరక్షించలేక సీడబ్ల్యూసీ ద్వారా దత్తత కేంద్రానికి సెంట్రల్ అడాప్షన్ రిజిస్ట్రేషన్ అథారిటీ (కెరా) అనుమతితో తిరిగి అప్పగించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ చిన్నారులను ఇటలీకి చెందిన మిస్టర్ ఫ్లేవియో బర్‌బరా, మిస్సెస్ అలెన్సియా డిగ్రిగోలి దంపతులు దత్తత తీసుకున్నారన్నారు. వీరి దత్తతను ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన జిల్లా కలెక్టర్ ఆమోదించి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ దత్తతలో భాగంగా ఈ చిన్నారుల పేర్లను ఇషాన్ నయ్యర్ నుంచి బర్‌బరా సాయి ఆచారిగా, దియా నయ్యర్‌ను బర్‌బరా మానసగా మార్చుకున్నారని వెంకటలక్షుమ్మ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

- కలెక్టర్ శ్రీనివాసులు



విశ్వనగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల(సిటీ): ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని విశ్వనగర్‌లో ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.డెంగ్యూ వ్యాధికి కారణమైన టైగర్ దోమలు మంచినీటి నిల్వ ఉన్నటువంటి ప్రదేశాలలో చేరి గుడ్లు పెట్టిన అనంతరం లార్వా, పెద్ద దోమగా మారి డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు జ్వరాలు ప్రబలేందుకు కారణమవుతుందన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మలేరియా అధికారి కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్‌లకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు అఫీసియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు జిల్లా సహకార అధికారులకు అధికారం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సహకార శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ రాజశేఖర్ జీవో ఆర్‌టీ నంబరు 409 జారీ చేశారు. ఈ జీవోకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని 99 పీఏసీఎస్‌లకు సహకార శాఖకు చెందిన వివిధ కేటగిరిల ఉద్యోగులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ కర్నూలు, నంద్యాల జిల్లాల సహకార అధికారులు రామాంజనేయులు, వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 పీఏసీఎస్‌లకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా జూనియర్ ఇన్‌స్పెక్టర్ మొదలు కొని అసిస్టెంట్ రిజిస్ట్రార్ వరకు నియమితులయ్యారు. చైర్మన్‌కు ఉన్న అధికారాలన్నీ వీరికి ఉంటాయి.

చిరుత బారి నుంచి గోవులకు రక్షణ



గోశాల ఫెన్సింగ్ చుట్టూ గ్రీన్ మ్యాట్

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా ఆలయ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నారు. అటవీశాఖ అధికారుల సూచన మేరకు మహానంది ఆలయ ఆవరణలోని గోశాల చుట్టూ ఫెన్సింగ్ వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. గోవులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా ఉండేందుకు ఆలయ అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

డీసీసీబీ జీఎంగా శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు(డీసీసీబీ) జనరల్ మేనేజర్(జీఎం)గా శివలీల విధుల్లో చేరారు. ఈమె గతంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించేవారు. సెలవుల్లో వెళ్లి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో వచ్చిన తర్వాత విధుల్లో చేరారు. అప్పట్లో జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తీసుకోకపోవడం, కోడ్ ఉన్నా డీసీసీబీ చైర్‌పర్సన్‌ను కలవడం వివాదాస్పదమైంది. కోడ్‌ను ఉల్లంఘించారనే కారణంతో అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారు. నాటి నుంచి ఇన్‌చార్జ్ సీఈఓగా ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ వ్యవహరిస్తున్నారు. అయితే శివలీలపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా వ్యవహరించిన నారపురెడ్డి మౌర్య ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఉర్దూ వర్సిటీ వీసీ రాజీనామా

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఫజుల్ రహమాన్ తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి తన రాజీనామా లేఖను పంపారు. హైదరాబాద్ మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం జువాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ అయిన ఫజుల్ రహమాన్‌ను అప్పటి ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీగా నియమించింది. మార్చి 3న వీసీగా బాధ్యతలు స్వీకరించారు. రెండు సంవత్సరాల ఐదు నెలలు వైస్‌చాన్స్‌లర్‌గా కొనసాగారు.

న్యాయ శాఖ మంత్రి ఇలాఖాలో ఆక్రమణల పర్వం



మున్సిపల్ స్థలం ప్రహరీని కూలగొట్టిన దృశ్యం



పార్క్ స్థలాన్ని కబ్జా చేసి చదును చేసిన దృశ్యం

- పార్కు స్థలాన్ని కబ్జా చేసిన టీడీపీ నేత
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

బొమ్మలసత్రం: 'అధికారం మాదే.. మాకు అడ్డే లేదంటూ' టీడీపీ నేతలు ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్నారు. సాక్షాత్తూ న్యాయ శాఖ మంత్రి ఎన్‌డీఎం ఫరూక్ ప్రాతినిధ్యం వహిస్తున్న నంద్యాల పట్టణంలోనే దర్జాగా మున్సిపల్ స్థలం కబ్జా అవుతున్నా అడిగేవారు లేరు. నంద్యాల పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత, సీనియర్ న్యాయవాది రైతుబజార్ పక్కన ఉన్న ఒక ఎకరా మున్సిపల్ స్థలాన్ని కబ్జాకు పాల్పడ్డాడు. ఎకరా ఖాళీ స్థలంపై గత కొన్ని రోజులుగా టీడీపీ నేత ఆక్రమించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. సాక్షాత్తు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సొంత నియోజకవర్గంలో అన్యాయంగా మున్సిపల్ స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహించటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి మున్సిపల్ స్థలం కబ్జా చేయకుండా పార్క్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. మున్సిపల్ అధికారులతో చర్చించి స్థలం ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఆ స్థలానికి ఎదురుగా టీడీపీ నేత న్యాయవాది కార్యాలయం ఉండటంతో స్థలాన్ని ఎలాగైనా ఆక్రమించి తన ఆధీనంలో ఉంచుకోవాలని చాలా రోజులుగా కన్నేశాడు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తన దారికి ఎవరూ అడ్డులేరని భావించి యథేచ్ఛగా ఆక్రమణకు తెరలేపాడు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి ఏర్పాటు చేయించిన ప్రహరీని రెండు వైపులా కూలగొట్టించాడు. ఆ స్థలంలో కంకర, మట్టి పోయించి చదను చేయించాడు. తన వాహనాలు నిలిపేందుకు అన్ని రకాలుగా అనువుగా ఉండేలా స్థలాన్ని చదును చేయించాడు. టీడీపీ నేత బరితెగింపు చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజలకు ఉపయోగపడే పార్కు స్థలాన్ని టీడీపీ కబ్జా చేయటంపై ప్రజలు మండిపడుతున్నారు.

పచ్చిమిర్చి ధర భగభగ

- వారాంతపు సంతలో కిలో రూ. 120

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో శుక్రవారం నిర్వహించిన వారాంతపు సంతలో వ్యాపారులు కిలో పచ్చిమిర్చి రూ.120కు విక్రయించారు. పచ్చిమిర్చితో పాటు మిగిలిన కూరగాయల ధరలు కూడా కిలో రూ.80కు విక్రయించటంతో వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆలోచనలో పడ్డారు. గత వారం కిలో టమోటా రూ.100కు విక్రయించగా ఈ వారం రూ.20లు తగ్గించి రూ.80లకు విక్రయించారు. బెండ, కాకర, చెవులకాయలు, వంకాయలు, క్యారెట్, క్యాబేజీ, బీట్‌రూట్ ఇలా ఏ కూరగాయ కొనుగోలు చేసినా కిలో రూ.80ల ధర చెప్పటంతో వినియోగదారులు అరకొరగా కొనుగోలు చేశారు. వారంతపు సంతకు రూ.500లు తీసుకెళ్లినా సరిపోవటం లేదని చెబుతున్నారు.



జూపాడుబంగ్లా వారాంతపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

హత్య చేసి.. సాధువు వేషం వేసి

- ఏడాదిగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు



హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీశైలం: ఏడాది కిత్రం శ్రీశైల క్షేత్ర పరిధిలో ఓ వ్యక్తిని హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను సీఐ ప్రసాద రావు శుక్రవారం మీడియాకు వివరించారు. గుంటూరు జిల్లా తెనాలి మల్లెపాడు గ్రామానికి చెందిన మడబాల ఎం.కిషోర్ అలియాస్ ప్రేమానంద్ శ్రీశైలం క్షేత్ర పరిధిలోని ఘంటామఠం సమీపంలో సంచరిస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో స్థానిక ఆటో డ్రైవర్ అబ్రహంతో పరిచయం ఏర్పడింది. తరచూ ఇదరూ కలసి మద్యం సేవించేవారు. వీరి మధ్య డబ్బు విషయంలో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో గతేడాది జూలై 3వ తేదీన ఇద్దరు ఘర్షణ పడ్డారు. ప్రేమానంద్ కట్టెతో అబ్రహం తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా నిందితుడు ప్రేమానంద్ సాధు వేషం ధరించి షిరిడీ, కాశీ, యాగంటి, డోన్, కర్నూలు, మద్దికెర తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ ఏడాది కాలంగా తప్పించుకు తిరిగాడు. ఇక తనను ఎవరూ గుర్తించరని మళ్లీ శ్రీశైలం చేరుకున్నాడు. కాగా సాధువు వేషంలో తిరుగుతున్న ప్రేమానంద్‌ను పోలీసులు గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు. జడ్జి ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించారు. నిందితుడి అరెస్ట్‌లో ప్రతిభ చూపిన ఎస్‌ఐ లక్ష్మణ్‌రావుతో పాటు హోంగార్డు సుంకన్న, అమర్నాథ్‌రెడ్డిని సీఐ ప్రశంసించారు.

పెద్దాసుపత్రిలో 'డుమ్మా' రోగం!

- విధులకు ఎగనామం పెడుతున్న కొందరు వైద్యులు
- ఇల్లు, క్లినిక్ నుంచే హాజరు వేస్తున్న వైనం
- ఎఫ్ఆర్ఎస్‌ను లెక్కచేయని వైద్య సిబ్బంది
- రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన సమస్య

కర్నూలు(హాస్పిటల్): సాక్షాత్తూ జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీల కంటే వారికి ఉన్నతమైన జీతాలు. వారి కంటే పనిచేసే కాలమూ తక్కువే. కానీ ఆ తక్కువ సమయం కూడా ఆసుపత్రిలో ఉండకుండా సొంత క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలకు డుమ్మా కొడుతున్నారు. వైద్యులను చూసి పలువురు ఉద్యోగులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది సైతం ఇదే తరహా పద్ధతి అవలంబిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరు విధానాన్ని గమనించి నోరెళ్లబెట్టినట్లు తెలిసింది. మొత్తంగా 30 శాతానికి పైగా వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది బయటి నుంచే హాజరు వేస్తున్నట్లు వారి దృష్టికి వచ్చింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అంటే రాయలసీమ జిల్లాల ప్రజలందరికీ పెద్ద దిక్కు. సీమ ప్రాంతమంతా ఎన్నో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు పుట్టుకొచ్చినా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వైద్యులంటే ఆయా ప్రాంత ప్రజలకు అంత నమ్మకం. అందుకే వ్యయప్రయాసలకు ఓర్చి వందల కిలోమీటర్లు ప్రయాణించి చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ 2,500 నుంచి 3వేల మంది రోగులు చికిత్సకు వస్తున్నారు. వీరితో పాటు నిత్యం 1200 నుంచి 1500 మంది ఇక్కడే ఉండి చికిత్స పొందుతూ ఉంటారు. వీరికి వైద్యం చేసేందుకు, ఇతర సేవలు అందించేందుకు గాను వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిపి దాదాపు 2వేల మంది దాకా విధులు నిర్వహిస్తున్నారు. రోగులతో పాటు వారి సహాయకులు కలిపి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో ఆసుపత్రిలో 8వేల నుంచి 10వేల మంది తిరుగుతూ ఉంటారు.

రూ. లక్షల్లో జీతాలు....గంటల్లో పనులు

సాధారణంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యుడు సీనియర్ అయితే అతని జీతం ఒక లక్ష రూపాయలు పైగానే ఉంటుంది. అదే సీనియర్ ప్రొఫెసర్ అయితే రూ.2.5లక్షలు ఉంటుంది. ఇక హెచ్‌వోడీలు, సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ స్థాయి అధికారులకైతే రూ.3లక్షలకు పైగా జీతం వస్తుంది. పైగా వీరికి ఆరోగ్యశ్రీ కేసులు చేసినందుకు వచ్చే ప్రోత్సాహక నగదు అదనం. ఇంత జీతం వస్తున్నా కొందరు వైద్యులు డ్యూటీ సమయంలో ప్రైవేటు బాట పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సి ఉండగా మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇందులో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, అనెస్తీషియా, సూపర్‌స్పెషాలిటీ విభాగాల వైద్యులు ఉన్నారు. ఎవ్వరైనా వీరి కోసం వార్డుకు వెళితే సార్ ఇప్పుడే ప్రిన్సిపాల్ ఆఫీస్‌కు, సూపరింటెండెంట్ ఆఫీస్‌కు, బ్యాంక్‌కు, ఇతర విభాగానికి రౌండ్స్‌కు వెళ్లారని అక్కడున్న వారు చెబుతారు. వారు చెప్పిన చోటుకు వెళితే అక్కడా వీరు కనిపించరు. పేరుకు ఆసుపత్రిలోనే ఉన్నామని అందరినీ నమ్మిస్తూ వారి సొంత ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఇతర ఆసుపత్రుల్లో సేవల్లో తరించేందుకు వెళ్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో రోగులను చూడకపోయినా ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులను మాత్రం తప్పనిసరిగా చూసి వస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలా బయటకు వెళ్లేందుకు వారు సొంత వాహనాలు ఉపయోగించకుండా వారి సహాయకుల వాహనాల్లో వెళ్లిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. వీరిని చూసిన పలువురు నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు సైతం ఇదే బాట పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సమయపాలన పాటించాలి

కర్నూలు సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రతి ఒక్కరూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆయా విభాగాధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ డ్యూటీ టైమ్ ప్రకారం మూడు పూటలా ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలన్నారు. మినిస్టీరియల్ ఉద్యోగులు సైతం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సీఎస్ఆర్ఎంవో, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో, ఏఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్(స్టోర్), హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రొఫెసర్లు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఉండాలన్నారు. అన్ని పారామెడికల్ స్టాఫ్, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు తమ షిఫ్టుల ప్రకారం రోజుకు మూడుసార్లు హాజరు వేయాలని తెలిపారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విధుల్లో లేని వారిపై చర్యలకు సిఫారసు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరువేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హౌస్‌సర్జన్లు, డ్యూటీ డాక్టర్లు సైతం షిఫ్టుల ప్రకారం ముఖహాజరును సమయానికి సమర్పించాలని లేకపోతే వారి జీతంలో కోత విధిస్తామని హెచ్చరించారు.

ఎఫ్ఆర్ఎస్ అంతా బోగస్!

ఉద్యోగులు సమయపాలన పాటించాలన్న ఉద్దేశంతో ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ యాప్ తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రోజుకు మూడుసార్లు వారు ఆసుపత్రిలో ఉండి హాజరు వేయాల్సి ఉంటుంది. మొదట్లో దాదాపుగా అందరూ ఆసుపత్రిలో ఉండే హాజరు వేశారు. కొందరు మొండి ఘటాలు మాత్రం వారి క్లినిక్‌ల నుంచి హాజరు వేశారు. ఇలా హాజరు వేయడాన్ని డీఎంఈ సైతం చూసే సాంకేతికత ఈ యాప్ సొంతం. ఇలా పలువురు వైద్యులను గుర్తించి అప్పట్లో మందలించి మెమోలు సైతం జారీ చేశారు. దీంతో దాదాపు అందరు వైద్యులు సమయ పాలన పాటిస్తున్నారు. ఈ విధానం కొన్ని నెలలు బాగానే కొనసాగింది. ఆ తర్వాత మళ్లీ ఎవ్వరూ ప్రశ్నించకపోవడంతో పలువురు వైద్యులు పాత విధానంలోనే విధులకు హాజరవుతున్నారు. కొందరు ఏకంగా వారి సొంత ఆసుపత్రులు, క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు, ఇళ్ల వద్ద నుంచి హాజరు వేస్తున్నారని ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు వారిని మందలించాలని ఆసుపత్రి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.




కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

రాక్‌గార్డెన్‌లో షూటింగ్ సందడి

- చూసేందుకు అనుమతి నిరాకరణ
- నిరాశతో వెనుతిరిగిన బాలయ్య అభిమానులు



రాక్‌గార్డెన్‌లో చిత్ర బృందం,



సినిమా షూటింగ్ జరిగిన వంతెన ప్రాంతం

ఓర్వకల్లు: సినిమా షూటింగ్‌తో రాక్‌గార్డెన్‌లో సందడి నెలకొంది. సితారా ఎంటర్‌ప్రైజెస్ ప్రొడక్షన్ బ్యానర్‌పై 'ఎన్‌బికే-109' పేరుతో నిర్మిస్తున్న చిత్రంలో పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. గురువారం అడవి బిడ్డలతో పాట సన్నివేశం తీయగా.. రెండో రోజు శుక్రవారం గుర్రాలపై విలన్‌లతో ఫైట్, కొండ దేవతకు పూజలు, గుహలో తపస్సు వంటి సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రంలో హీరో బాలకృష్ణ సరన ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సూర్యదేవర నాగవంశీ నిర్మాతగాను, బాబి దర్శకునిగాను వ్యవహరిస్తున్నట్లు చిత్ర పరిశ్రమ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా చేస్తున్న షూటింగ్ శుక్రవారంతో ముగిసిందన్నారు. ఇదిలా ఉండగా.. బాలకృష్ణను చూసేందుకు వచ్చిన అభిమానులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేయడంతో వారు నిరుత్సాహంతో వెనుతిరిగి వెళ్లారు. గతంలో ఈ ప్రాంతంలో టక్కరిదొంగ, ఆది, సుభాష్‌చంద్రబోస్, బహుబలి, జయంమన దేరా తదితర చిత్రాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. షూటింగ్‌తో రాక్‌గార్డెన్‌కు రూ.1.50 లక్షలు ఆదాయం లభించినట్లు టూరిజమ్ హోటల్ అసిస్టెంట్ మేనేజర్ జీవన్‌రాయ్ తెలిపారు. ఇందులో 18 గదుల అద్దెలు, వాటర్ బాటిల్స్, ఐస్‌క్రీమ్‌లు, లొకేషన్ చార్జీలతో కలిపి ఈ ఆదాయం సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు.

గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చాలి

- జూలై 1న జాతీయ గోర్ బంజారా సమ్మేళనం
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కైలాస్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): దేశంలో సుగాలీలు 18 కోట్ల మంది ఉన్నారని, వారు మాట్లాడే ' గోర్‌బోలీ ' భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్‌నాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ 1997 జూలై 1న ఆవిర్భవించిందని, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 1న నిర్వహించనున్న జాతీయ గోర్ బంజారా సమ్మేళనానికి దేశంలోని 16 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమ్మేళనంలో దేశ వ్యాప్తంగా లంబాడీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కార్యాచరణను రూపొందిస్తామన్నారు. 'మా తండాలో మా రాజ్యం' అనే నినాదంలో భాగంగా రాష్ట్రంలో 500 జనాభాకు పైగా ఉన్న తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించారని, ఆయా తండాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలను నిర్మించి వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజునాయక్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మానాయక్, కోశాధికారి ఎస్ వెంకటనాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు అనితాబాయి, ఎస్‌టీ ఉద్యోగ సంఘం అధ్యక్షులు నేనావత్ రామునాయక్, రంగానాయక్, రామాంజినాయక్, జయనాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

- ఆటోతో పాటు మద్యం సీజ్



తనిఖీల్లో పట్టుబడిన మద్యం, ఆటోను చూపుతున్న సెబ్ సిబ్బంది

కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో భారీగా తెలంగాణ మద్యం పట్టుబడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరు మండలం పెద్దపాడు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. కర్నూలు వైపు నుంచి కోడుమూరు వైపు వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో తెలంగాణకు చెందిన 144 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన షేక్‌షావలికి చెందిన మద్యంగా గుర్తించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే దూపాడు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ వద్ద కూడా 71 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఆటోను కర్నూలు సెబ్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సెబ్ స్టేషన్ ఎస్‌ఐలు రెహనా బేగం, మారుతీ ప్రసాద్‌తో పాటు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

వినియోగదారులకు అందుబాటులో అండుకొర్రల రొట్టెలు




అండుకొర్రలతో తయారు చేసిన రొట్టెలు

కర్నూలు(అగ్రికల్చర్): పోషక విలువలు అపారంగా ఉన్న అండుకొర్రలతో రొట్టెలు తయారవుతున్నాయి. అండుకొర్రల రొట్టెలకు వినియోగదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఇప్పటి వరకు అండుకొర్రల అన్నం మాత్రమే తింటున్నాం. తాజాగా అండుకొర్రల రొట్టెలు కూడా అందుబాటులోకి రావడం విశేషం. ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సంఘం అధ్యక్షుడు కె.వేణుబాబు ప్రత్యేకంగా చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, అరికలు, సామలు, ఊదలు సాగు చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సంఘం ద్వారా కలెక్టరేట్ ప్రాంగణంలో మిల్లెట్ కేఫ్ ఏర్పాటు చేయించింది. ఇందులో చిరుధాన్యాలకు చెందిన ఆహారంతో పాటు వివిధ చిరుధాన్యాల తినుబండరాలు అందుబాటులో ఉంటున్నాయి. తాజాగా అండుకొర్రల రొట్టెలను వినియోగదారులకు అందుబాటులో ఉంచడం విశేషం. కిలో అండుకొర్రల రైస్ ధర రూ.250 ఉంది. కిలో రైస్‌కు అర కిలో రాయచూరు జొన్నలు కలిపి రొట్టెలు తయారు చేసేందుకు శ్రీకారం చుట్టారు. పోషక విలువలు, విటమిన్‌లు అపారంగా ఉండటం, రుచిలో కూడా ప్రత్యేకత ఉండటంతో ఈ రొట్టెలను వినియోగదారులు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో రొట్టెను రూ.25 ప్రకారం విక్రయిస్తున్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): 2024–25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో రెండో విడత ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల జిల్లా కన్వీనర్ ప్రసాదరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు జూన్ 29వ తేదీ నుంచి జూలై 25 వరకు నంద్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులు జూలై 27, 28 తేదీల్లో నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఐటీఐ విద్యార్హతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఒక సంవత్సరం కోర్సులు మెకానికల్ డీజల్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, రెఫ్రిజియేషన్ అండ్ ఎయిర్ కండీషన్ టెక్ కోర్సులు ఉన్నాయన్నారు.

నవ వధువు ఆత్మహత్య



మృతి చెందిన నేహా కుమారి పాండె

బేతంచెర్ల: రెండు నెలల క్రితం ఆమెకు వివాహమైంది. ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతానికి రావాల్సి వచ్చింది. తల్లిదండ్రులను వదిలి ఉండలేక తీవ్ర మనస్తాపంతో చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన బేతంచెర్లలో చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రం సారెన్ జిల్లా పటేరిబేజ్ గ్రామానికి చెందిన గురూజ్ సింగ్‌తో నేహ కుమారి పాండె (23)కు ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన వివాహమైంది. మూడు రోజుల క్రితం వీరు అక్కడి నుంచి బేతంచెర్లకు ఓ పాలీస్ బండల ఫ్యాక్టరీలో పని చేసేందుకు వచ్చారు. ఫ్యాక్టరీలో పని చేస్తూ అక్కడే ఓ గదిలో నివాసముంటున్నారు. కాగా మొదటి సారి తల్లిదండ్రులను వదలి ఒంటరిగా ఉండలేక మనస్తాపానికి గురైన నేహ కుమారి పాండె నివాసముండే గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త గురూజ్ సింగ్ గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బ్యాచ్ నెంబర్ 48 బీర్ల విక్రయాలు నిలుపుదల

బొమ్మలసత్రం: జిల్లాలో బ్యాచ్ నెంబర్ 48 కింగ్ ఫిషర్ బీర్ల విక్రయాలు నిలుపుదల చేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈనెల 25వ తేదీన డోన్ పట్టణంలోని ప్రభుత్వ దుకాణంలో కొనుగోలు చేసిన కింగ్ ఫిషర్ బీరు బా టిల్లో ప్లాస్టిక్ స్పూన్ బయటపడింది. ఇందుకు సంబంధించి విజయవాడ కమిషనర్ కార్యాలయానికి సమాచారం అందించామని పే ర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో బ్యాచ్ నెంబ ర్ 48 బీర్ల విక్రయాలు వెంటనే నిలిపివేయాలని ఆదేశించినట్లు వివరించారు.

రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్



రోడ్డు విస్తరణ కోసం తవ్విన గుంతను జేసీబీతో పూడ్చుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. తుమ్మలపెంట సమీపం నుంచి సాయి బాబా గుడి వరకు మధ్యలో రోడ్డు ఇరుకుగా మారడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని సీఎస్ఆర్ నిధులతో 130 మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేసేందుకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట మల్లేశ్వరరెడ్డికి సిమెంట్ కంపెనీ పనులను అప్పగించింది. వారం రోజుల క్రితం రెండు మీటర్ల మేర వెడల్పు రోడ్డు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టారు. కాగా రోడ్డును ధ్వంసం చేస్తున్నారనే కారణంతో అధికార పార్టీ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు అల్ట్రాటెక్ యాజమాన్యం, మల్లేశ్వరరెడ్డిపై కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అధికారుల ఆదేశాల మేరకు సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ కోసం తీసిన గుంతలను జేసీబీతో రెండు రోజుల నుంచి పూడ్చి వేయిస్తున్నారు. ఈ మార్గం మీదుగా అల్ట్రాటెక్ టెక్ సిమెంట్ ఫ్యాక్టరీలోకి భారీ వాహనాలతో పాటు పెట్నికోట, గొర్విమానుపల్లె, తుమ్మలపెంట గ్రామాల నుంచి నాపరాళ్ల ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ప్రతి రోజు పదుల సంఖ్యలో రవాణ జరుగుతుంటాయి. రోడ్డుకు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు సంభవిస్తుండటంతో విస్తరణ పనులు చేసేందుకు యాజమాన్యం ముందుకొచ్చింది. రోడ్డు పనులు నిలిచిపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.